
సాక్షి హనుమకొండ

గురువారం | 13 | జూలై | 2023



కాంగ్రెస్.. రైతు పక్షపాతి
కాంగ్రెస్ పార్టీ రైతు పక్షపాతి అని, రేవంత్ వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేతలు వక్రీకరించారని డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. - 8లో



పీహెచ్‌డీ అభ్యర్థులకు శుభవార్త
కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష రాసి ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ షెడ్యూల్‌ను బుధవారం అధికారులు విడుదల చేశారు. - 8లో



గరిష్టం/కనిష్టం
$34^0/26^0$

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుంది. సాయంత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సృజనాత్మక పోస్టర్లు సమాజాన్ని కదిలిస్తాయి



విద్యారణ్యపురి: సృజనాత్మక పోస్టర్‌లు సమాజాన్ని కదిలిస్తాయని జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా బుధవారం 'పర్యావరణ పరిరక్షణ' అంశంపై పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయిలో పోస్టర్ల తయారీ పోటీలు నిర్వహించారు. హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా సోషల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను జిల్లా విద్య క్వాలిటీ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. కాలిగ్రాఫర్ రాంపల్లి విజయభాస్కర్ చిత్రలేఖనంపై సూచనలిచ్చారు. చిత్రకారులు బి.మల్లయ్య, ఆర్.విజయభాస్కర్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం విజేతలకు నగదుతో పాటు షీల్డులు, మెరిట్ సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యాంసుందర్, సోషల్ స్టడీస్ సబ్జెక్ట్ ఫోరం బాధ్యులు మధుసూదన్‌రెడ్డి, సతీశ్ ప్రకాశ్, రాధాకృష్ణ చారి, శైలజ, రేవతి, కృష్ణ, అశోక్, శ్రీధర్, నర్సయ్య, శ్రీనివాస్, సీఆర్‌పీలు మున్ని, పద్మ, రేవతి, రమేశ్ పాల్గొన్నారు.

కాజీపేట ఏసీపీ బదిలీ

వరంగల్ క్రైం: కాజీపేట ఏసీపీ పి.శ్రీనివాస్ సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మాదాపూర్ సబ్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. కాజీపేటకు ఇంకా ఎవరినీ నియమించలేదు. ఈ ఏడాది ఎన్నికలు జరగనున్న దృష్ట్యా వరంగల్ కమిషనరేట్ పరిధిలో మరికొంత మంది ఏసీపీలు బదిలీ అయ్యే అవకాశం ఉంది.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు షురూ



వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్‌లోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ఐదో తరగతిలో ప్రవేశాలకుగాను బుధవారం జిల్లా స్థాయి ఎంపికలు హనుమకొండలోని జేఎన్ఎస్‌లో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 50 మంది బాలబాలికలు హాజరైనట్లు డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సాగిన ఎంపిక ప్రక్రియలో సర్టిఫికెట్ల పరిశీలన, బ్యాటరీ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. గురువారం ఎంపికలు కొనసాగుతాయని ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఎంపిక ప్రక్రియలో జిల్లా యువజన, సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ కె.అనిల్, డీఎస్‌ఏ కోచ్‌లు ఎండీ అఫ్జల్, రమేశ్, అనిల్, ప్రశాంత్, శంకర్, రాజు డీఎస్‌ఏ సిబ్బంది పాల్గొన్నారు.

20న జెడ్పీ సర్వసభ్య సమావేశం

హన్మకొండ: హనుమకొండ జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 20న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. హనుమకొండలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఈ సమావేశం జరుగుతుందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 20న ఉదయం 10:30 గంటలకు జరిగే ఈసమావేశానికి సభ్యులు, అధికారులు సకాలంలో రావాలని కోరారు.

హ్యాండ్‌బాల్ ఇండియన్ టీం కోచ్‌గా విష్ణువర్ధన్

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో జరగనున్న 10వ ఏషియన్ ఉమెన్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఇండియన్ టీం కోచ్‌గా హనుమకొండ డీఎస్‌ఏ కోచ్ బొడ్డు విష్ణువర్ధన్ నియమితులయ్యారు. ఈమేరకు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు, ఈడీ డాక్టర్ ఆనంద్‌జేషవర్‌పాడే బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. విష్ణువర్ధన్‌ను డీవైఎస్ఓ అశోక్, సహచర డీఎస్‌ఏ కోచ్‌లు, హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా బాధ్యులు, క్రీడాకారులు అభినందించారు.

9 మంది డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో బుధవారం నిర్వహించిన డిగ్రీ సెమిస్టర్ల పరీక్షల్లో 9 మంది విద్యార్థులు డీబార్ అయ్యారు. వివిధ పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్‌కు పాల్పడుతూ స్క్వాడ్లకు పట్టుబడి డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలాదేవి తెలిపారు.

నిర్లక్ష్యం వీడితేనే హరితం!

'గ్రేటర్'లో హరితహారం పేరుతో కాకిలెక్కలు

- నిర్వహణ లేక లోపిస్తున్న పచ్చదనం
- ఈ ఏడాది 15లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక
- నెలాఖారులో లేదా ఆగస్టులో పంపిణీకి రంగం సిద్ధం
- నాటడంతోపాటు పరిరక్షణ అవసరమంటున్న నగరవాసులు



హరితహారం కోసం భట్టుపల్లిలోని నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

వరంగల్ అర్బన్ : గ్రేటర్ వరంగల్ మహానగరంలో ఈ ఏడాది హరితహారం కార్యక్రమానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా నగరాలు, పట్టణాలను సుందరంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దాలని చెబుతోంది. మున్సిపల్ 2019–చట్టాన్ని అనుసరించి ప్రత్యేకంగా గ్రీన్ బడ్జెట్ (హరితనిధి) కేటాయిస్తోంది. అందుకోసం వ్యాపార, వాణిజ్య వర్గాల ట్రేడ్ లైసెన్స్‌తోపాటు ఏడాదికి రూ.వెయ్యి అదనంగా వసూలు చేస్తున్నారు. అంతా బాగానే ఉన్నా.. మహానగరంలో డివైడర్లు, కొన్ని ఖాళీ స్థలాల్లో, అభివృద్ధి చెందిన కాలనీల్లో తప్ప పచ్చని చెట్లు కరువయ్యాయి. కొన్నేళ్లుగా మొక్కల పెంపకం పెద్దఎత్తున చేపడుతున్నామని అధికారులు రికార్డుల్లో చూపుతున్నా.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు.

గతంలో పరిస్థితి ఇలా..

- 2020–22 సంవత్సరాల్లో రూ.20కోట్ల నిధులతో నగరంలోని పలు డివిజన్‌లలో మొక్కలు నాటినట్లు చెబుతున్నారు.
- గడిచిన ఐదేళ్లలో 44లక్షల మొక్కలు నాటినట్లు లెక్కలు చూపిస్తున్నారు.
- 2022–23 సంవత్సరంలో 15లక్షల టార్గెట్‌కుగాను 22,61,238 మొక్కలు నాటినట్లు పేర్కొన్నారు.
- ప్రతి ఏడాది ఇవే లెక్కలు, రికార్డులు చూపిస్తూ మమ అనిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

నాటేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి

మొక్కలు నాటే ముందు నేలను పరీక్షించాలి. ఎంపిక చేసిన స్థలంలో మట్టి ఏ తరహా మొక్కలకు అనువుగా ఉంటుందో గుర్తించాలి. కానీ బల్దియా అధికారులు, సిబ్బంది, థర్డ్ పార్టీ కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా కాని చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మొక్కలు నాటాక వాటి ఆలనాపాలన తీసుకోవడం లేదు. నిర్వహణను గాలికి వదిలేయడంతో మొక్కలు కాస్త పశువులకు మేతగా మారిపోతున్నాయి. అన్నింటికీ తట్టుకుని పెరిగినా అవి విద్యుత్ తీగలకు తాకుతుండడంతో మధ్యలోనే నరికివేస్తున్నారు. ఐదేళ్ల కాలంలో మొక్కల పెంపకం కోసం దినసరి కూలీలు, రవాణా, ట్రీ గార్డులు, పిట్ తీసే మిషన్లు ఖర్చులన్నీ ఉద్యానవన విభాగం నుంచి చెల్లిస్తున్నారు. అద్దె వాహనాలు, ఇతర వ్యయం అంతా ఇంజినీరింగ్ విభాగం ప్రతిపాదిస్తోంది. మొక్కల పెంపకం, నాటడం, పర్యవేక్షణ నిమిత్తం పెద్దఎత్తున నిధులు నీళ్లలా ఖర్చవుతున్నా నగరంలో పచ్చదనం అనుకున్నంత కనిపించడం లేదనే భావన ప్రజల్లో నెలకొంది.

టార్గెట్ 15లక్షల మొక్కలు

- గ్రేటర్ పరిధిలో ఈ ఏడాది హరితహారానికి ఏర్పాట్లు చేస్తున్నారు.
- వర్షాలు విస్తారంగా కురిస్తే 15లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యం నిర్ణయించారు.
- ఇవే కాకుండా.. సామాజిక అడవుల శాఖ (సోషల్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్), కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ (కుడా)ల నుంచి మరిన్ని మొక్కలను తీసుకునేందుకు ప్రణాళికలు రచించారు.
- ఇందులో రెండు లక్షల పండ్ల మొక్కలు, మరో రెండు లక్షల పూల మొక్కలు ఉండనున్నాయి.
- ప్రజల అవసరాలరీత్యా ప్రైవేట్ నర్సరీల నుంచి మొక్కలు తీసుకోవాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నారు.
- ఇప్పటికే నగర మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా పలుమార్లు సమీక్షించి ఉద్యానవన విభాగం అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు.
- కాలనీ కమిటీలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేసేందుకు నిర్ణయించారు.

ఈ ఏడాది లక్ష్యం ఇలా..

ఇంటింటికీ పంపిణీ	10,77,600
శ్మశాన వాటికలు, స్మృతివనాలకు	50,400
విద్యాసంస్థలు, ఖాళీ స్థలాలు	51,180
రోడ్డు సైడ్	16,000
అవెన్యూ ప్లాంటేషన్	37,000

మిగతా మొక్కలు ఖాళీస్థలాలు, ఇతర ప్రదేశాల్లో నాటాలని నిర్ణయించారు.

7 నర్సరీల ద్వారా పంపిణీ



హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే ఉద్దేశంతో నగరంలో 7 నర్సరీలను ఏర్పాటు చేశాం. ఈనెలాఖరులో లేదా ఆగస్టు మొదటి వారంలో మొక్కలు నాటుతాం, పంపిణీ చేస్తాం. భట్టుపల్లి, మడికొండ, కాజీపేట డీజిల్ కాలనీ, బాల సముద్రంలో రెండు, వరంగల్ క్రిష్టియన్ కాలనీ, లేబర్ కాలనీతోపాటు 22 ప్రకృతి వనాలనుంచి పంపిణీ చేస్తాం.

– శ్రీనివాస్‌రావు, బల్దియా ముఖ్య ఉద్యానవన అధికారి

ఆ పాప.. మా బిడ్డ కాదు!

సీడబ్ల్యూసీ, పోలీసుల ఎదుట ఒప్పుకున్న భోజనీ దంపతులు

- అక్రమ దత్తతపై నిజమైన సాక్షి కథనం.. తల్లిదండ్రుల జాడే తెలియాలి
- విరాణీ దంపతులపైనా జేజే యాక్ట్ 81 సెక్షన్ కింద కేసు నమోదు
- కొంపల్లిలోని ఓ ఆస్పత్రిలో విక్రయించిన ఆయా రాణి
- ఆమెకు మంచిర్యాల వాసి కృష్ణవేణి ఇవ్వడంతో కేసులో ఇంకో ట్విస్ట్
- శిశువుల అక్రమ రవాణా వెనుక ముఠా ఉందా అనే దిశగా విచారణ
- పోలీసులు పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తేనే ఈ కేసు కొలిక్కి వచ్చే చాన్స్



పాపతో సీడబ్ల్యూసీ, జిల్లా బాలల సంరక్షణ విభాగాధికారులు, పోలీసులు



ఆ పాప ఎవరు..?

సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి, వరంగల్ :

సాక్షి ఎఫెక్ట్

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'సాక్షి'లో వచ్చిన 'ఆ పాప ఎవరు' అనే కథనం నిజమైంది. ఇంటర్ కంట్రీ అడాప్షన్ పేరెంట్స్ (పాప్స్) నిబంధన కింద దత్తత తీసుకునేందుకు ఏకంగా ఆ పాపకు వరంగల్‌లో ఉంటున్న రషీదాభాను భోజనీ దంపతులను బయోలాజికల్ పేరెంట్స్‌గా ఇన్నాళ్లు పేర్కొన్నారు. కానీ, ఆ పాప అసలు తల్లిదండ్రులు వారు కాదని తేలింది. స్వయంగా ఆ దంపతులే ఒప్పుకోవడంతో ఆ ఆరు నెలల పాపను అసలు ఎక్కడి నుంచి తీసుకొచ్చారు.. కొనుగోలు చేశారా.. ఎవరైనా కిడ్నాప్ చేసిన పాపను వీరు కొన్నారా..ఆ పాప అసలు తల్లిదండ్రులు ఎవరనేది పోలీసులు క్షేత్రస్థాయిలో విచారణ చేస్తేనే వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రాథమిక విచారణ ప్రకారం.. మేడ్చల్ జిల్లా కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆయాగా పనిచేసే రాణినే తమకు ఆ బిడ్డను ఇచ్చిందని భోజనీ దంపతులు చెప్పారు. ఆ రాణి మరో మహిళ మంచిర్యాలకు చెందిన కృష్ణవేణి నుంచి తీసుకున్నట్లు చెప్పడంతో దీని వెనుక పెద్ద రాకెట్ ఏమైనా ఉందనే అనుమానాలు కలుగుతున్నాయి. ఎందుకంటే ఆ పాప వద్ద లభించిన ఆధార్ కార్డులు పరిశీలిస్తే హైదరాబాద్‌లో ఉంటున్న గుజరాతీయుల పాపగా తెలుస్తోంది. వారిని కూడా అదుపులోకి తీసుకొని విచారిస్తే అసలు తల్లిదండ్రులు ఎవరనేది తెలిసే అవకాశముంది.

తెలిసి మరీ తప్పు చేశారు...

అమెరికాలో స్థిరపడిన కొంపల్లి వాసి కరీమ్‌విరాణి, వరంగల్‌లో ఉంటున్న అతడి చెల్లెలు రషీదాభాను భోజనీ అన్నాచెల్లెలు. అయితే ఉద్యోగరీత్యా అమెరికాకు వెళ్లిన కరీమ్‌విరాణి అమెరికా సిటిజన్ అయిన ఆశామావిరాణిని పెళ్లి చేసుకొని అక్కడే ఉంటున్నారు. వీరికి పిల్లలు లేకపోవడంతో ఎంబసీలోని ఫారెన్ ఆథరైజ్డ్ ఏజెన్సీ (ఆపా) వద్ద పిల్లలు దత్తత కావాలంటూ రిజిస్ట్రేషన్ చేసుకున్నా బతికున్న తల్లిదండ్రుల నుంచి పిల్లలను దత్తత తీసుకునేందుకు వీల్లేదని పేర్కొంది. అందుకే 8 నెలల క్రితం భారత్‌కు వచ్చిన వీరు.. ఓ ఆరు నెలల పాప జనన ధ్రువీకరణ పత్రాలతోపాటు వీసా తీసుకొని అమెరికా వెళ్లబోగా అక్కడా ఇమ్మిగ్రేషన్ అధికారులు తిరస్కరించారు. అప్పటికే అన్న కోరిక మేరకు ఆ పాప తనకు పుట్టినట్టుగానే ఇన్నాళ్లూ చెప్పుకున్న రషీదాభాను భోజనీ సీడబ్ల్యూసీ ఎదుట బుధవారం మాత్రం తప్పు ఒప్పుకుంది. ఆ పాప తనకు జన్మించలేదని చెప్పారు. దీంతో వరంగల్‌లోని పోలీసు కమిషనరేట్ కార్యాలయానికి వెళ్లిన వీరు.. కొంపల్లిలోని కరీమ్ విరాణి, ఆశామావిరాణితోపాటు ఆరు నెలల పాపను తీసుకురావాలని పట్టుబట్టడంతో వారికి సమాచారం ఇచ్చారు. ఇలా వారు కారులో మధ్యాహ్నం మూడు గంటలకు కమిషనరేట్‌కు చేరుకోగా.. అక్కడ వారితో మాట్లాడిన తర్వాత సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ, జిల్లాల బాలల సంరక్షణ విభాగ బృందంతోపాటు విరాణి, భోజనీ దంపతులు పాపతో మట్టెవాడ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేజే యాక్ట్ 81 సెక్షన్ కింద అక్రమ దత్తత వ్యవహారంలో భోజనీ, వీరాణి దంపతులపై కేసు నమోదు చేశారు. అనంతరం పోలీసుల సమక్షంలో సీడబ్ల్యూసీ ఆదేశాల మేరకు ఆ పాపకు వైద్య పరీక్షలు చేసి హనుమకొండలోని శిశువిహార్‌కు తరలించారు. అయితే, కొంపల్లిలో తల్లిదండ్రులు ఉండడంతో రషీదాభాను భోజనీ అక్కడికెళ్తుండేది. అక్కడ ప్రార్థనా మందిరానికి వెళ్లిన సందర్భంలో ఓ ఆస్పత్రిలో పనిచేసే ఆయా రాణితో పరిచయం ఏర్పడింది. ఈ సమయంలోనే అన్న కరీమ్ విరాణికి పాప కావాలని ఆమెకు ఓసారి చెప్పడంతో రోజుల పసికందును తీసుకొచ్చి భోజనీకి ఇచ్చింది. ఆ తర్వాత కొంపల్లికి వచ్చిన విరాణి దంపతులకు ఇచ్చానని భోజని సీడబ్ల్యూసీకి వివరించారు.

ప్రజల ఆకాంక్ష మేరకు కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వాల్సిందే..

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్

కాజీపేట: తెలంగాణ ప్రజల ఆకాంక్షను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గౌరవించి కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుమతులను వెంటనే మంజూరు చేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. కాజీపేటలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వందే భారత్ రైలు విడిభాగాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడం మానుకుని కాజీపేట వ్యాగన్ తయారీ పరిశ్రమలో తయారు చేసేలా బీజేపీ రాష్ట్ర నాయకులు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అనుమతులను సాధించాలని కోరారు. చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యే అరూరి రమేశ్ మాట్లాడుతూ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం అనుమతులను మంజూరు చేస్తే అవసరమైన స్థలం ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. సమావేశంలో మండలి వైస్ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ఎంపీ పసునూరి దయాకర్, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, నాయకులు సంకు నర్సింగ్, చింతల యాదగిరి, పి.రాంమూర్తి, సుంచు కృష్ణ, తేలు సారంగపాణి, నార్లగిరి రమేశ్ పాల్గొన్నారు.

వ్యాగన్ స్థల సందర్శన..



రైల్వే వ్యాగన్ లే అవుట్‌ను పరిశీలిస్తున్న మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎంపీ దయాకర్, ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, రమేశ్

కాజీపేట రూరల్: కాజీపేట మండలం అయోధ్యపురం శివారు పరిధిలో నిర్మించతలపెట్టిన రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమ స్థలాన్ని ఎంపీ పసునూరి దయాకర్, మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, అరూరి రమేశ్ పరిశీలించారు. అనంతరం వ్యాగన్ లే అవుట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సుందర్‌రాజ్ , ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ కిరణ్‌కుమార్, స్థానిక కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్‌రావు, సంకు నర్సింగరావు, మునిగల సరోజ, అరుణ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్

- వామపక్ష విద్యార్థి సంఘాల రాస్తారోకో
- ఓ కళాశాలలో ఫర్నిచర్ ధ్వంసం!
- విద్యార్థి సంఘాల బాధ్యుల అరెస్ట్



రాస్తారోకో చేస్తున్న నాయకులు, విద్యార్థులు

విద్యారణ్యపురి: వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ జిల్లాలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. కేయూ క్రాస్ నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమై కాజీపేట వడ్డేపల్లి మీదుగా అశోక సెంటర్‌కు చేరుకుంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ విద్యార్థి సంఘాలు రాస్తారోకో నిర్వహించాయి. రాస్తారోకో చేస్తున్న నాయకుల్లో కొందరిని పోలీసులు అరెస్ట్ చేసి సుబేదారి స్టేషన్‌కు తరలించారు. క్లాస్‌లు యథావిధిగా కొనసాగిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఓప్రైవేట్ కళాశాలలో ఫర్నిచర్ ధ్వంసం చేసినట్లు తెలిసింది. కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు మొగిలి వెంకటరెడ్డి, భాషబోయిన సంతోశ్, నరసింహారావు, మంద శ్రీకాంత్, మిశ్రీన్ సుల్తాన, మాస్ సావిత్రి, సత్యనారాయణ, బాషబోయిన వేణురాజ్, వేల్పుల చరణ్, ప్రణీత్‌గౌడ్, మురళి, పూర్ణచందర్, ప్రశాంత్, శివ, రాచకొండ రంజిత్, ప్రవీణ్, మహేశ్, ముషారఫ్, గణేశ్, రాజ్‌కుమార్, భగవాన్‌రెడ్డి, సంజయ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలి

ధర్మసాగర్: సాగుకు ఉచిత విద్యుత్ వద్దన్న పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి తెలంగాణ రైతులకు క్షమాపణ చెప్పాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఉచితంగా 24 గంటల కరెంట్ ఇస్తుంటే 3 గంటలు చాలని అమెరికాలో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం ధర్మసాగర్, వేలేరు మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో రాజయ్య మాట్లాడుతూ.. తెలంగాణ మోడల్ దేశమంతటా కావాలని ప్రజలు ఎదురుచూస్తున్న తరుణంలో రేవంత్‌రెడ్డి వంటి రైతు వ్యతిరేకి ఉచిత విద్యుత్ అవసరం లేదని అనడం సిగ్గు చేటని మండిపడ్డారు. రైతును రాజును చేయాలని కేసీఆర్ ముందుకు పోతుంటే రేవంత్‌రెడ్డి రైతుల పాలిట రాబందులా మారాడన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో రైతులకు పెట్టుబడి సాయం, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్, ఎరువులు, విత్తనాలు, గిట్టుబాటు ధరకే ధాన్యం కొనుగోళ్లు వంటివి కార్యక్రమాలు అమలు చేస్తుంటే ఓర్చుకోలేని రేవంత్‌రెడ్డి రైతులపై తనకున్న వ్యతిరేక వైఖరిని తానా సభలో వెళ్లగక్కారని తెలిపారు. రేవంత్‌రెడ్డి తాను చేసిన రైతు వ్యతిరేక వివాదాస్పద వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని రైతులకు క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే రాజయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి, జెడ్పీటీసీలు చాడ సరిత, పిట్టల శ్రీలత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మునిగెల రాజు, కర్ర సోమిరెడ్డి, తిరుమల్‌రెడ్డి, బొడ్డు సోమయ్య, బిల్లా యాదగిరి, మహ్మద్ జానీ, పెద్ది శ్రీనివాస్‌రెడ్డి, బొడ్డు ప్రతాప్, ప్రేమ్‌రాజ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య, బీఆర్ఎస్ నాయకులు

ఆర్థిక సాయం వేగవంతం చేయండి

హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

కాజీపేట: బీసీ కుల వృత్తులు, చేతి వృత్తుల వారికి ప్రభుత్వం అందించే లక్ష రూపాయల ఆర్థికసాయం పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలో వేగవంతం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. బుధవారం రాత్రి హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో బీసీ కులవృత్తులకు అందించే సాయంపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆర్థిక సాయానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న చేతివృత్తిదారుల ప్రతీ దరఖాస్తును పరిశీలించాలని సూచించారు. జిల్లాలో 13,322 మంది దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని ఆదేశించారు. సమీక్షలో బీసీ వెల్ఫేర్ అధికారి రాంరెడ్డి, పరకాల మున్సిపల్ కమిషనర్ శేషు, డీపీఓ జగదీశ్, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

డిగ్రీ కళాశాలల్లో జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు

విద్యారణ్యపురి: జిల్లాలోని వివిధ డిగ్రీ కళాశాలల్లో జాబ్ ఓరియెంటెడ్ కోర్సులను ప్రవేశపెట్టినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాగ్దేవి డిగ్రీ కళాశాలలో బీబీఏ (లాజిస్టిక్స్), బీబీఏ (రిటైల్ మేనేజ్‌మెంట్), కాకతీయ డిగ్రీ కళాశాలలో బీఏ టూరిజం మేనేజ్‌మెంట్ అండ్ రిటైల్ మేనేజ్‌మెంట్, బీబీఏ రిటైల్ ఆపరేషన్స్), బీఎస్సీ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్), వరంగల్‌లోని సీకేఎం కళాశాలలో బీబీఏ (రిటైల్ ఆపరేషన్స్), బీబీఏ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. కోర్సు సమయంలో మూడ్రోజులు క్లాస్‌లు, మరో మూడ్రోజులు ఉద్యోగ శిక్షణ నైపుణ్యాలు నేర్పనున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో ప్రతినెలా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నెలవారీగా రూ.7,000 స్టైఫండ్ చెల్లిస్తారని తెలిపారు. విద్యార్థులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. వాగ్దేవి కళాశాల 94411 36452, కాకతీయ కళాశాల 94414 12857, సీకేఎం కళాశాల 93901 00634 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ సూచించారు.

ఆర్డీ మహిళా కళాశాలలో..

హన్మకొండ: హనుమకొండ కిషన్‌పురలోని ఆర్డీ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో బీబీఏలో కొత్త కోర్సులు ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ప్రిన్సిపాల్ ఎస్.సంజీవరావు, సెక్రటరి బండి మల్లేశం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా బీబీఏ రిటైల్ ఆపరేషన్స్ కోర్సు, బీబీఏ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ కోర్సులు ప్రవేశ పెట్టామని పేర్కొన్నారు. ఈకోర్సులు అభ్యసించే వారికి ఏదైనా పరిశ్రమలో ఇంటర్న్‌షిప్ ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న దోస్త్ మూడో ఫేజ్ ఈనెల 14తో ముగుస్తుందని, ఆసక్తి కలిగిన విద్యార్థులు పూర్తి వివరాలకు 99490 86752, 90599 10298 ఫోన్ నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

రైలునుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం

గార్ల: గుర్తుతెలియని రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన బుధవారం గార్ల మండలం రాంపురం గ్రామ సమీపంలో జరిగింది. డోర్నకల్ రైల్వే ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం కాజీపేట నుంచి విజయవాడ వెళ్లే గుర్తుతెలియని రైలులో సుమారు 45 సంవత్సరాల వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి డోర్ వద్ద కూర్చున్నాడు. ఈ క్రమంలో రాంపురం గ్రామ సమీపంలో మలుపు వద్ద రైలు నుంచి జారి దుర్మరణం చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఆకుపచ్చ చొక్కా, నల్ల ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం మార్చురీలో భద్ర పరిచినట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

పెద్దవంగర: అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన బుధవారం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం అవుతాపురంలో జరిగింది. గ్రామానికి చెందిన కూటికంటి శాంతమ్మ (65) కుటుంబ సభ్యులతో ఉంటుంది. మంగళవారం రాత్రి తన కొడుకు కిరాణం వెళ్లి తిరిగి వచ్చే సరికి మృతి చెంది కనిపించింది. సహజ మరణమని భావించిన బంధువులు.. బుధవారం శాంతమ్మ అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో ఆమె మృతదేహంపై గాయాలు కనిపించాయి. దీంతో కొడుకు యాకయ్యకు అనుమానం వచ్చి తన భార్యను, ఆమె తమ్ముడిని నిలదీయడంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. దీనిపై యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి ..

కేసముద్రం: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలోని ధన్నసరి శివారు సొలతండాలో జరిగింది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం తండాకు చెందిన ధారావత్ భీమా(45), బద్రి దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత యేడాది క్రితం పెద్దకూతురి పెళ్లి చేశారు. ఈ క్రమంలో అత్తగారింటి వద్ద గొడవలు తలెత్తడంతో కూతురు తిరిగి ఇంటికి వచ్చి ఉంటుంది. ఈ విషయంతోపాటు, ఆర్థిక ఇబ్బందులతో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన భీమా ఈనెల 9న పురుగుల మందుతాగి ఆత్మహత్యకుయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య బద్రి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కన్నా.. కళ్లు తెరువు!

- కుక్క దాడిలో గాయపడిన బాలుడి మృతి
- రాజీవ్ గృహకల్పలో విషాదం

కాజీపేట అర్బన్: బుడి బుడి నడకలు. బుజ్జి బుజ్జి పలుకులు. అల్లరి చేష్టలు. మమ్మీ.. డాడీ అంటూ ఇప్పుడిప్పుడే మాటలు నేర్చుకుంటున్న ఆ బాబు భవిష్యత్ గురించి తల్లిదండ్రులు ఎన్నో కలలు కన్నారు. కానీ వారి కలలకు 18 నెలలకే ఫుల్‌స్టాప్ పడింది. గతనెల వీధి కుక్కల దాడిలో గాయపడిన డేవిడ్‌రాజ్ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. 'కన్నా.. కళ్లు తెరువు. 18 నెలలకే నీకు నూరేళ్లు నిండాయా' అంటూ ఆతల్లిదండ్రులు రోదించిన తీరు అక్కడున్న వారి మనసును కదిలించింది.

మృత్యువుతో పోరాడి..

కాజీపేట మండలం భట్టుపల్లి, కొత్తపల్లి గ్రామానికి చెందిన పోలేపాక మత్యాస్, కళ్యాణి దంపతులకు నాలుగేళ్ల సామ్యేల్. 18 నెలల డేవిడ్ రాజ్ సంతానం. వాటర్‌మెన్‌గా పని చేస్తున్న మత్యాస్ కుటుంబంతో కలిసి కడిపికొండ రాజీవ్ గృహ కల్ప సముదాయంలో నివాసముంటున్నాడు. జూన్ 17న ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న డేవిడ్‌రాజ్‌పై వీధి కుక్క దాడి చేసి ముఖంపై తీవ్రంగా గాయపర్చింది. చికిత్స నిమిత్తం బాలుడిని తల్లిదండ్రులు ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ముఖంపై రెండు కుట్లు పడ్డాయి. డేవిడ్ రాజ్ ఆరోగ్యం కాస్త మెరుగుపడగా.. పది రోజుల అనంతరం ఇంటికి తీసుకొచ్చారు. తర్వాత కుక్క దాడితో ఇన్‌ఫెక్షన్ కారణంగా జ్వరం వచ్చింది. మళ్లీ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లగా మలేరియా జ్వరం వచ్చినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. కాగా.. చికిత్స పొందుతూ.. డేవిడ్‌రాజ్ 26 రోజులు మృత్యువుతో పోరాడి బుధవారం తుదిశ్వాస విడిచాడు. బాలుడి మృతితో కుటుంబీకులు, బంధువుల్లో తీవ్ర విషాదం నెలకొంది.




డేవిడ్‌రాజ్ (ఫైల్), ఆస్పత్రిలో బాలుడు

కారణమెవరు?

కడిపికొండలోని రాజీవ్ గృహకల్పలో వీధి కుక్కలు ఇప్పటికీ స్వైర విహారం చేస్తున్నాయి. అయినా బల్దియా సిబ్బంది పట్టించుకోవడం లేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. వీధి కుక్కలను పట్టుకునేందుకు వాహనం లేదని చెప్పి.. కుక్క దాడి జరిగిన రోజు శానిటరీ సిబ్బంది వచ్చి తూతూమంత్రంగా ఒక్క కుక్కను పట్టుకున్నారు. 'డ్యూటీ టైం అయిపోయింది. మళ్లీ రేపొస్తాం' అంటూ వెళ్లిపోయారు. కుక్కల స్వైరవిహారం కారణంగా పిల్లలను ఇంటి నుంచి బయటకు పంపించాలంటే భయమేస్తోందని, తక్షణమే ప్రజాప్రతినిధులు, బల్దియా అధికారులు చొరవ చూపి వీధికుక్కల బారి నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. బాలుడి మృతికి కారణమెవరని వారు ప్రశ్నిస్తున్నారు. నగరంలో మరోసారి ఇలాంటి ప్రమాదం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్టీసీ అప్పును ఈక్విటీగా మార్చాలి

- బడ్జెట్‌లో 2 శాతం నిధులు కేటాయించాలి
- ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హన్మకొండ : టీఎస్ ఆర్టీసీ అప్పును ప్రభుత్వ ఈక్విటీగా మార్చాలని, రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీకి 2 శాతం నిధులు కేటాయించాలని ఆర్టీసీ జేఏసీ వరంగల్ రీజియన్ చైర్మన్ ఎం.శ్రీనివాస్, కన్వీనర్ టి.ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు ఆర్టీసీ సమస్యలు ప్రభుత్వానికి తెలపాలని కోరుతూ బుధవారం హనుమకొండ కలెక్టరేట్ అధికారికి వినతిపత్రం అందించినట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఏర్పాటై పది సంవత్సరాలు అవుతున్నా రాష్ట్రంలో ఆర్టీసీ పరిస్థితి మారలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో వేలాది మంది కార్మికులకు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. 2017 వేతన సవరణ చేయకుండా, వేతనాలు పెంచకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. కార్మికుల సొసైటీకి చెందిన రూ .3700 కోట్లు యాజమాన్యం వినియోగించుకుని కా ర్మికుల ఆర్థిక అవసరాలకు నిధులు లేకుండా చేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి 2017, 2021 వేతన సవరణ ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సీహెచ్ రా మచందర్, టి.శ్రీనివాస్, ఎ.మురళి, పి.కె.మూర్తి, వి.సి.కుమార్. పి.ప్రభాకర్, వి.బాలయ్య పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్టీసీ జేఏసీ నాయకులు

కాంగ్రెస్.. రైతుల పక్షపాతి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి
- రాస్తారోకో, బీఆర్ఎస్ దిష్టిబొమ్మ దహనం

హసన్‌పర్తి: కాంగ్రెస్ రైతుల పక్షపాతి అని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ వక్రీకరించినందుకు నిరసనగా ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉచిత విద్యుత్ ఫైల్‌పై సంతకం చేసింది కాంగ్రెస్ పార్టీ అని, ఏక కాలంలో రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కూడా కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. విద్యుత్ కొనుగోళ్లల్లో తెలంగాణ ప్రభుత్వం లక్షలాది రూపాయల గోల్‌మాల్ జరిగిందన్నారు. కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈనిరసనలో కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ కో–ఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్, పెంబర్తి సర్పంచ్ పూల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, డివిజన్ అధ్యక్షుడు కిరణ్, పొన్నాల రఘు, నాయకులు ఆరెల్లి వెంకటస్వామి, చేరాలు, రవి, జె.రవి, శ్రీనివాస్, మురళి తదితరులు పాల్గొన్నారు.

కేసుల మాఫీ కోసం బీజేపీతో చేతులు కలిపిన బీఆర్ఎస్

కాజీపేట: అవినీతి ఊబిలో కూరుకుపోయిన బీఆర్ఎస్ పార్టీ.. తన కేసుల మాఫీ కోసం బీజేపీ అధిష్టానంతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుందని డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. సోమిడిలో బుధవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల ఆంజనేయులు, ఎండీ.అంకూస్, ఇప్ప శ్రీకాంత్, ఎంపీ.రాజు, బుర్ర బాబురావు, నాగపురి లలిత పాల్గొన్నారు.



హసన్‌పర్తిలో బీఆర్ఎస్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన

సోమిడి గ్రామ శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బుధవారం డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో చల్లా వాసుదేవరెడ్డి, అంకూస్, బంక సరళా సంపత్, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అభ్యర్థులకు శుభవార్త..

- ప్రవేశాలకు ఇంటర్వ్యూ షెడ్యూల్ విడుదల

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష రాసి ప్రవేశాల కోసం వేయికండ్లతో ఎదురు చూస్తున్న అభ్యర్థులకు శుభవార్త.. పీహెచ్‌డీ రెండో కేటగిరీలో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు అధికారులు ఎట్టకేలకు బుధవారం షెడ్యూల్ విడుదల చేశారు. కాగా, పీహెచ్‌డీ ప్రవేపరీక్ష నిర్వహించి ఫలితాల అనంతరం అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి రెండునెలలు గడిచాయి. దీంతో ఇంటర్వ్యూల కోసం అభ్యర్థులు సుదీర్ఘకాలంగా ఎదురు చూశారు. ఈ నేపథ్యంలో చివరకు ప్రవేశాలకు ఇంటర్వ్యూ షెడ్యూల్ ఖరారు చేసినట్లు విశ్వవిద్యాలయాల అడ్మిషన్ల డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ వాసుదేవ రెడ్డి వెల్లడించారు.

విభాగాల వారీగా ఇంటర్వ్యూల తేదీలు..

ఇంగ్లిష్ ఈనెల 20, 21, తెలుగు 22, 23, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ 20, 21, ఈఐఈ(ఇంజనీరింగ్)20, ఈసీఈ 20, సివిల్ ఇంజనీరింగ్ 20, మెకానికల్ ఇంజనీరింగ్ 21, సీఎస్ఈ 21, 22 , ఫార్మసీ 24, 25, హిస్టరీ 22, టూరిజం మేనేజ్‌మెంట్ 22, ఎకనామిక్స్ 22, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ 23, హెచ్ఆర్ఎం 23, సోషియాలజీ 24, సోషల్ వర్క్ 24, పొలిటికల్ సైన్స్ 25, జియాలజీ 22, కెమిస్ట్రీ 22, బయోటెక్నాలజీ 23 , మైక్రో బయాలజీ 23, స్టాటిస్టిక్స్ 24, మ్యాథమేటిక్స్ 24, కంప్యూటర్ సైన్స్ 25, ఫిజిక్స్ 25, జువాలజీ 26, 27, లా 25, ఫిజికల్ ఎడ్యుకేషన్ 25వ తేదీల్లో నిర్వహించేందుకు సంబంధిత విభాగాల డీన్‌లు నిర్ణయం తీసుకున్నారని వాసుదేవరెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలు ఈనెల 4వ తేదీన విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ. ఏసి.ఇన్‌లో వివరాలు పొందుపరుస్తామని తెలిపారు. ప్రొఫెసర్లు బన్న అయిలయ్య, మనోహర్, కిషన్, మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, అమరావేణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అదుపు తప్పి.. గోడను ఢీకొన్న జీపీ ట్రాక్టర్

- తాత్కాలిక డ్రైవర్‌కు తీవ్రగాయాలు..
- ఆస్పత్రికి తరలింపు

దుగ్గొండి: జీపీ ట్రాక్టర్ అదుపు తప్పి గోడను ఢీకొంది. దీంతో తాత్కాలిక డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం మండలంలోని దేశాయిపల్లిలో జరిగింది. పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉండడంతో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు చెత్త తరలింపు కోసం జీపీ ట్రాక్టర్ నడపడానికి తాత్కాలిక డ్రైవర్‌గా నల్లబెల్లి సురేశ్‌ను నియమించారు. మధ్యాహ్నం చెత్తను తరలిస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి మురుగుకాలువలోకి దూసుకెళ్లి గోడను ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్ సురేశ్‌కు స్టీరింగ్ బలంగా తాకింది. దీంతో చికిత్స నిమిత్తం సురేశ్‌ను వెంటనే వరంగల్‌కు తరలించారు.

రుణం కిస్తీలు చెల్లించాలని ఫేక్‌కాల్స్

- పోలీసులను ఆశ్రయించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయుడు తీసుకున్న రుణం కిస్తీలు కట్టడంతో కాస్త ఆలస్యమైంది. ఈక్రమంలో కిస్తీలు చెల్లించాలని, లేని పక్షంలో విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఫేక్‌కాల్స్ ద్వారా బెదిరించిన ఘటన బుధవారం మానుకోటలో జరిగింది. ఈక్రమంలో వచ్చినవి ఫేక్‌కాల్స్ అని తెలుసుకున్న సదరు ఉపాధ్యాయుడు తోటి ఉపాధ్యాయులతో కలిసి పోలీసులను ఆశ్రయించాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబాబాద్ మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు ఓ ప్రైవేట్ రుణ కంపెనీ నుంచి సుమారు రూ.4లక్షల రుణం తీసుకున్నాడు. నెలనెలా కిస్తీలు చెల్లిస్తున్నాడు. ఈక్రమంలో కొంతకాలంగా సదరు ఉపాధ్యాయుడు ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో ఇంకా నాలుగు కిస్తీలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తి ఉపాధ్యాయుడికి ఫేక్ కాల్స్ చేయడం ప్రారంభించాడు. కిస్తీలు కట్టడం లేదని విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, వారు వచ్చి సస్పెండ్ చేస్తారని, పోలీసులు అరెస్టు చేస్తారని ఆగంతకుడు బెదిరించాడు. దీంతో భయాందోళనకు గురైన సదరు ఉపాధ్యాయుడు తమ తోటి ఉపాధ్యాయులతో చర్చించాడు. వెంటనే వారు విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు రుణం తీసుకున్న విషయంపై తాము ఎలాంటి చర్యలు తీసుకోబోమని, అది ఆయన వ్యక్తిగతమని సమాధానం ఇచ్చారు. దీంతో ఆయనకు వచ్చినవి ఫేక్ కాల్స్ అని గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు.

పరీక్షలో ఫెయిలయ్యానని.. విద్యార్థి బలవన్మరణం

కాజీపేట: పరీక్షల్లో ఫెయిలయ్యానని మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి.. ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం కాజీపేట పట్టణంలోని 63వ డివిజన్ మహంకాళమ్మ దేవాలయ గల్లీలో జరిగింది. ఓడెల శ్రీరామ్ (20) రాంపురం గ్రామంలోని వీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో ఫెయిలయ్యాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై మృతుడి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని కాజీపేట సీఐ రాజు తెలిపారు.



శ్రీరామ్ (ఫైల్)

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

- టీఎస్ఎస్పీ బెటాలియన్స్ ప్రత్యేక డీఐజీ షర్ఫొద్దీన్ సిద్దిఖీ



ఆయుధ గదిని పరిశీలిస్తున్న టీఎస్ఎస్పీ ప్రత్యేక డీఐజీ షర్ఫొద్దీన్ సిద్దిఖీ

మామునూరు: శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ గుణాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని టీఎస్ఎస్పీ బెటాలియన్స్ ప్రత్యేక డీఐజీ షర్ఫొద్దీన్ సిద్దిఖీ తెలిపారు. వార్షిక తనిఖీలలో భాగంగా బుధవారం ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ 5వ బెటాలియన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా 2022–2023 సంవత్సరానికి సంబంధించిన తనిఖీలు నిర్వహించారు. అంతకు ముందు స్పెషల్ పోలీసులు డీఐజీకి గౌరవందనం సమర్పించారు. అనంతరం బెటాలియన్ అధికారులు, సిబ్బంది వివరాలు, అందుబాటులోనున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం టీఎస్ఎస్పీ పటిష్టం, స్పెషల్‌పోలీసుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. అధికారులు, సిబ్బంది మరింత కష్టపడి పనిచేసి పోలీస్‌శాఖకు మరింతం పేరు తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ కమాండెంట్ పెద్దబాబు, అసిస్టెంట్ కమాండెంట్ సోని, శ్రీధర్‌రాజు, ఆర్ఐలు కార్తీక్, సోలమన్ రాజు, శ్రీనివాస్, రాంప్రసాద్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాగుల్లో తీసుకొచ్చే పత్తి కొనాలి

- చాంబర్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

వరంగల్: రైతులు వ్యవసాయ మార్కెట్‌లకు బ్యాగుల్లో తీసుకు వస్తున్న పత్తిని కొనుగోలు చేయాలని వరంగల్ వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు బుధవారం ముంబైలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీఎండీ లలిత్ కుమార్ గుప్తాను కలిసి తెలంగాణ రాష్ట్రంలో పత్తి ఉత్పత్తి చేసే చిన్న, సన్నకారు రైతులు, కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమల సమస్యలు వివరించారు. చిన్న, సన్నకారు రైతులు 5 నుంచి 10 టన్నుల పత్తిని బ్యాగులలో తీసుకొని వస్తే సీసీఐ అధికారులు కొనుగోలు చేయడం లేదన్నారు. దీంతో వారికి లాభం కలగడం లేదన్నారు. దీనిపై స్పందించి ఆ రైతులకు మినిమం సపోర్ట్ ప్రైస్(ఎంఎస్పీ) వర్తింపజేయాలన్నారు. అలాగే, జిన్నింగ్ పరిశ్రమలలో కాటన్ బేల్స్‌తో సమానంగా పత్తి గింజలను కూడా వెనువెంటనే జాప్యం లేకుండా లిఫ్ట్ చేయాలని కోరారు. సీసీఐ పత్తిని జిన్నింగ్ చేసే క్రమంలో వెలువడే ట్రాష్(చెత్త)పర్సంటేజ్ నిర్ధయించడానికి శాంపిల్స్ తీసి లాబరేటరీకి ఒకటి రెండు రోజులలో పంపించి ల్యాబ్ రిపోర్టు 15 రోజులలో ఫలితాలను జిన్నింగ్ మిల్లుల యాజమాన్యానికి తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలపై సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తాతో పాటు ఉన్నతాధికారులు ప్రదీప్ కుమార్ అగర్వాల్, పాణిగ్రాహి సానుకూలంగా స్పందించినట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు.



సీసీఐ సీఎండీకి వినతి పత్రం అందజేస్తున్న చాంబర్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

విద్యార్థుల పరారీపై అధికారుల విచారణ

సాక్షి ఎఫెక్ట్..

ఏటూరునాగారం: ములుగు మండలం మల్లంపల్లి శివారులో ఓ ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్న ఏటూరునాగారం మండలానికి చెందిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి ఆదివారం మధ్యాహ్నం 8 మంది విద్యార్థులు పరారయ్యారు. జిల్లాలో ఆందోళన కలిగించిన ఈ ఘటనపై 'సాక్షి'లో 'గురుకులం నుంచి విద్యార్థులు పరార్' అనే శీర్షికతో మంగళవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ఐసీపీఎస్ అధికారులు బుధవారం మండల కేంద్రానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు తల్లిదండ్రులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల శరీరంపై ఏర్పడిన గాయాలను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులుకు అందజేస్తామని తెలిపారు. కాగా, ఈనెల 10వ తేదీన పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థులు మద్యం సేవించారనే నెపంతో పీఈటీ కార్తీక్ చితకబాదారు. తాము కూల్ డ్రింక్‌మాత్రమే తాగామని, మద్యం సేవించలేదని చెప్పినా వినకుండా తీవ్రంగా కొట్టడంతో భయాందోళనకు గురైన విద్యార్థులు గురుకులం నుంచి పారిపోయినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా పారిపోయిన విద్యార్థులు తల్లిదండ్రుల వద్దకు చేరడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఉపాధ్యాయుల పర్యవేక్షణ లోపమే:
విద్యార్థుల పరారీ ఘటనపై తల్లిదండ్రుల ఆరోపణ

ములుగు రూరల్: ములుగు మండలం మల్లంపల్లిలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఏటూర్‌నాగారం మండలానికి చెందిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు మద్యం సేవించి ఉపాధ్యాయులకు పట్టుబడిన ఘటన విదితమే. మద్యం సేవిస్తూ విద్యార్థులు పట్టుబడగా పీఈటీ మందలించారు.దీంతో విద్యార్థులు ఆదివారం మధ్యాహ్నం పాఠశాల నుంచి పారిపోయారు. దీనిపై ఉపాధ్యాయులు.. తల్లిదండ్రులకు సమాచారం అందించి విషయం తెలిపారు. దీంతో తల్లిదండ్రులు మంగళవారం విద్యార్థులను తీసుకుని పాఠశాలకు వచ్చారు. పర్యవేక్షణ లోపంతోనే విద్యార్థులు పరారయ్యారనే ఆరోపణలను స్వీకరించని ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. మద్యం సేవిస్తూ పట్టుబడిన 9 మంది విద్యార్థులకు టీసీ ఇచ్చి పాఠశాల నుంచి పంపినట్లు సమాచారం .

విలేకరులను అనుమతించొద్దు..

గురుకుల పాఠశాలకు విలేకరులను అనుమతించొద్దని ప్రిన్సిపాల్ అంకయ్య.. సెక్యూరిటీ గార్డుకు హుకుంజారీ చేశారు. దీంతో బుధవారం పాఠశాల సందర్శనకు వెళ్లిన విలేకరులను సెక్యూరిటీ గార్డు అడ్డుకున్నారు. పాఠశాలలోని వసతులు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విలేకరులను పాఠశాలకు అనుమంతిచకపోవడం సరికాదని, ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

నేడు ప్రిన్సిపాళ్లకు అవగాహన

కేయూ క్యాంపస్: విదేశాల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ఇంగ్లిష్ లాంగ్వేజ్ క్వాలిఫికేషన్ స్కాలర్‌షిప్స్ (2023–2024) ఆవిష్కరణపై విశ్వవిద్యాలయాల అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లకు గురువారం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కేయూలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర భూపరిపాలన కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచా ర్య ఆర్ లింబాద్రి, వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ పాల్గొంటారని తెలిపారు.

కేసీఆర్ దృష్టికి మత్స్యకారుల సమస్యలు..

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

హన్మకొండ చౌరస్తా: ఉచిత చేప పిల్లల పంపిణీకి బదులు నగదు అందజేయాలనే మత్స్యకారుల వినతిని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి అమలయ్యేలా తన వంతు కృషి చేస్తానని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. బుధవారం హనుమకొండ కాకతీయకాలనీలోని గంగా గార్డెన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం జనరల్ బాడీ సమావేశం సంఘం అధ్యక్షుడు బుస్సా మల్లేశం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి బండా ప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ఏడాది డిసెంబర్‌తో ఉమ్మడి వరంగల్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కాలపరిమితి ముగుస్తుండడంతో త్వరలోనే నూతన కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తెలంగాణ మత్స్య సహకార సమాఖ్య చైర్మన్ పిట్టల రవీందర్ మాట్లాడుతూ చేపల పంపిణీలో నాణ్యత, సైజ్‌ను మత్స్యకారులు దగ్గరుండి పరిశీలించుకోవాలన్నారు. చెరువుల పరిరక్షణ మత్స్యకారులదే అన్న ఆయన.. ప్రతి విషయంలో సర్కార్ ను నిందించడం మానుకుని చెరువును కాపాడుకుంటూ అభివృద్ధి చేసుకోవాలన్నారు. త్వరలోనే ప్రభుత్వం ఓ బృహత్తర కార్యక్రమం చేపట్టబోతుందన్నారు. చేపల ఉత్పత్తితో పాటు కొనుగోలును సైతం ప్రభుత్వమే జరిపేలా ప్రణాళిక రూపొందిస్తుందన్నారు.



మాట్లాడుతున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

రాష్ట్రంలో ఆక్వా కల్చర్ అభివృద్ధి

- ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ రవీందర్



మాట్లాడుతున్న రవీందర్

హన్మకొండ: రాష్ట్రంలో ఆధునిక విధానాలను అనుసరించి ఆక్వా కల్చర్ రంగాన్ని అభివృద్ధి పరిచేందుకు రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ సమగ్ర అధ్యయనం చేస్తోందని తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ పిట్టల రవీందర్ తెలిపారు. బుధవారం హనుమకొండలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు, ఇతర నీటి వనరుల్లో సంప్రదాయ విధానాలను అనుసరిస్తూ అనేక తరాలుగా చేపల పెంపకాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ వృత్తిలో ఆధునిక పరిజ్ఞానం జోడించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మత్స్యకారులు ఆధునిక పద్ధతులను పాటిస్తూ నిర్వహించే ఆక్వా కల్చర్ జల సేద్యంలో అవసరమైన ప్రావీణ్యం అందించేందుకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా చేపల ఉత్పత్తి, ఉత్పాదకతను సాధించడానికి ఈ ఆక్వా రంగం దోహదం చేస్తుందన్నారు. సంప్రదాయ పద్ధతుల్లో చేపల పెంపకం ద్వారా ఒక హెక్టార్‌కు కేవలం టన్ను చేపలను మాత్రమే ఉత్పత్తి చేసేందుకు అవకాశాలు ఉండగా.. ఆధునిక ఆక్వా కల్చర్ విధానాలను అనుసరించడం ద్వారా ప్రతి హెక్టార్‌కు మూడు నుంచి ఐదు టన్నుల చేపలను ఉత్పత్తి చేయొచ్చన్నారు. ఈ పద్ధతులతో తక్కువ నీటి విస్తీర్ణంలో ఎక్కువ చేపలను ఉత్పత్తి చేయొచ్చన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆక్వా కల్చర్ పరిశ్రమలను నిర్వహించేందుకు చాలా అవకాశాలున్నాయన్నారు. చేపలను శుద్ధి చేయడం, చేపల ఆహార ఉత్పత్తులను తయారు చేసే మధ్యతరహా, చిన్న తరహా పరిశ్రమలను నెలకొల్పేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాను అత్యంత అనువైన ప్రదేశంగా గుర్తించినట్లు చెప్పారు.